ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కర్నూలు
జిల్లా వార్తలు 5
గురువారం 28 నవంబరు 2024






మ్యూజికల్ చైర్ ఆడుతూ..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం సమీక్షలు, ఫైళ్ల పరిశీలనతో బిజీగా ఉండే కీలక ఉద్యోగులు వారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ జిల్లాను ప్రగతి బాటలో నడిపిస్తుంటారు. ఈ క్రమంలో ఒత్తిళ్లకు గురవుతుంటారు. అలాంటివారంతా ఆటల్లో నిమగ్నమయ్యారు. దైనందిన కార్యకలాపాలను పక్కన పెట్టి, స్థాయిభేదం మరచి సహచర ఉద్యోగులతో కలిసి పోటీపడ్డారు. కార్తీక వనభోజనాల పేరిట నిర్వహించిన ఈ ఉత్సాహ కార్యక్రమానికి నగరంలోని విజయవనం వేదికైంది. నగర శివారులోని విజయవనంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొన్నప్పుడే పాలన వ్యవహారాలు సాఫీగా, పారదర్శకంగా సాగుతాయన్నారు. కార్తీక వనభోజనంలో సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు శాస్త్రీయత ఇమిడిఉందన్నారు. తీరికలేని విధుల్లో బిజీగా ఉండే అధికారులు వనభోజనాల నేపథ్యంలో ఒకే వేదికపై ఇలా కలిసి ప్రకృతిని ఆస్వాదిస్తూ ఉల్లాసంగా గడపటం శుభపరిణామన్నారు. అనంతరం అధికారులు చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ వాలీబాల్, టాగ్ ఆఫ్ వార్, షాట్‌పుట్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి అవినాష్, జాయింట్ కలెక్టర్ నవ్య, డీఎఫ్‌వో శ్యామల, పర్యాటకశాఖ డీఎం విజయ, డీఈవో శ్యామ్యూల్, ఎఫ్ఆర్‌వో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న కలెక్టర్

నేడు, రేపు ఆర్‌యూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్ కోర్సుల్లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల కింద భర్తీ చేస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య నరసింహులు తెలిపారు. పీజీ సెట్ 2024 పరీక్షలో అర్హత సాధించిన దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుతో పాటు విద్యార్హతల ఒరిజనల్ ధ్రువపత్రాలు, కులధ్రువీకరణ పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ ట్యూషన్ ఫీజులతో ఈనెల 28, 29న వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. అడ్మిషన్లలో వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదని తెలిపారు.

8న జాతీయ ఉపకార వేతన పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి జరిగే జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను వచ్చే నెల 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామూల్‌పాల్ బుధవారం తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల యుడైజ్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాల విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసి అభ్యర్థులకు అందజేయాలని డీఈవో తెలిపారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29, నుంచి డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాల్లో 3వ సెమిస్టర్‌లో రెగ్యులర్ 7,047, సప్లమెంటరీలో 7,009, 5వ సెమిస్టర్‌లో రెగ్యులర్ 6,562, సప్లమెంటరీలో 4,334 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

పెళ్లి వేడుకలో విషాదం

డీజే వాహనం ఢీకొని బాలుడి మృతి

7లో

రబీ సాగు అంచనా 1,17,288 హెక్టార్లు

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో 1,17,288 హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో పంటలు ఎటువంటి ఆటంకాలు లేకుండా రైతులు సాగు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం రబీలో 66,744 హెక్టార్లలో (57 శాతం) సాగు జరిగినట్లు తెలిపారు. అత్యధికంగా 39,418 హెక్టార్లలో పప్పుశనగ పంట సాగు అయిందన్నారు. కందులు 9 హెక్టార్లలో, పెసలు 10 హెక్టార్లు, మినుములు 387 హెక్టార్లలో, వేరుశనగ 5,094 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 47 హెక్టార్లు, పొగాకు 37,149 హెక్టార్లు, వాము 694 హెక్టార్లు, మిరప 463 హెక్టార్లు, ఉల్లి 859 హెక్టార్లు, ఇతర పంటలు 368 హెక్టార్లు విస్తీర్ణంలో సాగైనట్లు తెలిపారు. ఇప్పటి దాకా రైతులు సాగు చేసిన ఏ పంటలకు తెగుళ్లు వ్యాపించలేదన్నారు. పంటల రక్షణకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రైతు సలహా కేంద్రాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని జేడీ తెలిపారు.

ఇసుక తోడేస్తున్నారు

మంత్రాలయం వద్ద తుంగభద్రను తోడేస్తున్న వైనం ● రూ.వేలల్లో ఇసుక దందా ● నేతల అండదండలతో అక్రమ రవాణా ● పట్టించుకోని అధికారులు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం వద్ద తుంగభద్ర ఒట్టిపోతోంది. నిత్యం ఇసుకను అక్రమంగా తరలించుకపోతున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.2వేల నుంచి రూ.3వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నాయకుల అండతో పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయాల ముందు నుంచి ప్రధాన రహదారుల గుండా విచ్చలవిడిగా ఇసుక ట్రాక్టరు వెళ్లిపోతున్నాయి. ఇసుకాసురులు పగలు, రాత్రి తేడా లేకుండా తుంగభద్రను తోడేసి గుంతలమయం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామానికి సమీపంలోని వంక, వాగు, నది నుంచి ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణాల కోసం మాత్రమే ఇసుకను తీసికెళ్లాలి. ఇక్కడ మాత్రం ఇసుకతో వ్యాపారం చేస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. వీటిపైన రెవెన్యూ, భూగర్భజలాలు, పోలీసు శాఖలు తమకు సంబంధం లేదన్నట్లు ప్రవర్తిస్తున్నాయి. మంత్రాలయం నుంచి సూగూరు, చెట్నహళ్లి, చిలకలడోన, కల్లుదేవకుంట, సూగూరు, బూదూరు, ఎమ్మిగనూరుకు సైతం ఇసుకను తరలిస్తున్నారు. మంత్రాలయానికి చెందిన ట్రాక్టర్లకే గాక ఇతర ట్రాక్టర్లు సైతం అధికార పార్టీకి చెందిన నాయకులు లీజుకు తీసుకుని మరింత అక్రమ ఇసుకను రవాణా చేయడం విశేషం. స్థానిక పంచాయతీ సెక్రటరీ అనుమతితో ఉచిత ఇసుక రవాణా చేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ ఈ పేరుతో తుంగభద్ర నది తీరంలోని ఇసుకను ఖాళీ చేస్తున్నారు. ప్రభుత్వం మద్యం, ఇసుకలో నాయకుల పాత్ర ఉంటే ఉపేక్షించేది లేదని స్పష్టంగా అంటున్నప్పటికీ ఇక్కడి నాయకులు పట్టించుకోకుండా ఒక్కో లాడ్జీ ముందు వందలాది ట్రాక్టర్ల ఇసుకను డంప్ చేస్తూ విక్రయిస్తున్నారు. లాడ్జీ నిర్మాణాల్లో బెస్‌మెంట్ ఎత్తుగా నిర్మించి అందులో గ్రావెల్ నింపాల్సి ఉండగా.. రాత్రికిరాత్రే ఇసుకతోనే నింపేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వంలో ఉచిత ఇసుక అందేది కాదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుకను ఉచితం చేయడంతో గతంలో ఇబ్బంది పడిన ఇసుకాసురులు ఇదే అదునుగా ఇసుకను నిల్వ చేసి మూడు పువ్వులు ఆరు కాయలుగా రోజుకు వేలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. మా నాయకులు చెప్పారు.. చేసుకుంటాం.. వైసీపీ హయాంలో వారు చేసుకున్నారు.. ఇప్పుడు మేం చేస్తే తప్పా అని బెదిరిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కళ్ల ఎదురుగా వందలాది ట్రాక్టర్లు తిరుగుతున్నా వీరికి ముడుపులు ఇచ్చుకోవడంతో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇసుక రవాణాను అరికట్టాలని కాలనీవాసులు, ప్రజలు కోరుతున్నారు.


లాడ్జీల ముందు డంప్ చేసిన ఇసుక

మంత్రాలయం వద్ద తుంగభద్రలో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లు


> మంత్రాలయం వద్ద తుంగభద్ర నుంచి అక్రమంగా ఇసుకను తరలించుకపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోజుకు 30 ట్రాక్టర్లు 400 పైగా లోడ్ల ఇసుకను కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు పోటీ పడుతున్నారు. అధికారులు దోబూచులాడుతున్నారు. పేదల ఇండ్ల నిర్మాణ సౌకర్యం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ.. మంత్రాలయంలో నాయకులకు కనక వర్షం కురుస్తున్నది.



అనుమతులు ఉంటేనే ఇసుక.. లేదంటే సీజ్ చేస్తాం

మంత్రాలయం గ్రామ పరిధిలో ఇసుక కావాలంటే పంచాయతీ కార్యదర్శితో అనుమతులు పొంది నది, వాగు, వంకల్లో నుంచి ఇసుకను తోడుకోవాలి. అనుమతి లేకుండా నదిలోని ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుని సీజ్ చేస్తాం. ఇళ్లు కట్టుకొనేవారు తమ ఇళ్లవద్ద 1 లేదా 2 ట్రాక్టర్ల ఇసుకను మాత్రమే నిల్వ ఉంచుకోవాలి.
- ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం



అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం

మంత్రాలయంలో ఇసుక రవాణాపై ఎంపీడీవో, తహసీల్దార్, మైనింగ్ అధికారులతో సంప్రదించి మైనింగ్, రెవెన్యూ, ఎంపీడీవోలతో సమావేశమై అక్రమ ఇసుకను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవు.
- రామాంజులు, సీఐ, మంత్రాలయం

వేదవతిలో రహదారి

హలహర్వి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గూళ్యం సమీపంలో వేదవతి నదిలో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బుధవారం రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలను కలిపే ఈ రహదారి ఎంతో కీలకం. నదిలో కొద్దిగా నీరు ప్రవహిస్తున్నది. ఈ నీటిలో పైపులు ఏర్పాటు చేసి పైన రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. దీని వల్ల బళ్ళారి జిల్లాను చేరుకోడానికి 45 కిలోమీటర్ల ప్రయాణ దూరం కేవలం 25 కిలోమీటర్లవుతుంది. రవాణా దూరం తగ్గించుకోవడానికే తాము చందాలు వేసుకుని రోడ్డు వేసుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు.


వేదవతి నదిలో రహదారి నిర్మాణం

కురువ కార్పొరేషన్ చైర్మన్‌గా దేవేంద్రప్ప ప్రమాణ స్వీకారం


చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవేంద్రప్ప

ఆదోని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ గొల్లపూడి బీసీ భవనంలో కురువ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన మాన్వి దేవేంద్రప్ప పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప చేత ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడారు. టీడీపీ కోసం కృషి చేసినందుకు అధినేత చంద్రబాబునాయుడు ఈ పదవి తనకు ఇచ్చారని దేవేంద్రప్ప అన్నారు.

స్థలం ఇచ్చే ప్రసక్తే లేదు..!


ఇన్‌గేట్ పక్కన ఉన్న ఖాళీ స్థలం ఇదే


- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, వైద్యుల ఏకగ్రీవ తీర్మానం
- మున్సిపల్ అధికారుల ప్రతిపాదనలపై మండిపాటు
- మా నిర్ణయాన్ని కాదని ముందుకుపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధం
- హెచ్చరిస్తున్న జూనియర్ డాక్టర్లు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డు విస్తరణలో కోల్పోయే షాపులకు ప్రత్యామ్నాయంగా మెడికల్ కాలేజీ స్థలం ఇచ్చే ప్రసక్తే లేదు. కాదు కూడదని బలవంతంగా ముందుకుపోతే ప్రత్యక్ష ఆందోళనకు ఏమాత్రం వెనుకాడబోం' అని జూనియర్ డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం కుడి వైపున ఉన్న దాదాపు ఎనిమిది సెంట్ల ఖాళీ స్థలాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే చేయడం, మంగళవారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థలాన్ని కేటాయించాలని ప్లాన్‌తో లెటర్ తీసుకొని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అందజేయడం వంటివి తాజాగా అలజడి రేపాయి. కర్నూలు నగరంలో రోడ్డు విస్తరణకు నగర పాలక మున్సిపల్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. దీంతో మెడికల్ కాలేజీ ఆనుకొని ఉన్న ఎనిమిది షాపులను తొలగించి వస్తోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా మెడికల్ కాలేజీ ఇన్‌గేట్, ఎగ్జిట్ గేట్‌ల మధ్య ఉన్న ఎనిమిది సెంట్ల స్థలాన్ని ఇవ్వాలనే ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దీనిపైనే మెడికల్ కాలేజీలో వివాదం నెలకొంది. ఈ ప్రతిపాదనలపై కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ వైద్యులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీలోని ఇన్‌గేట్ కుడివైపున ఉన్న ఖాళీ స్థలాన్ని షాపులకు ఇవ్వడం కుదరదని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని వైద్యులు ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు.

మిగతా 6లో..

ఓ ప్రాజెక్టు వ్యథ

12 ఏళ్లుగా అదే నిర్లక్ష్యం..!




అత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అత్మకూరు ప్రాంతంలోని రెండు మండలాల రైతుల కన్నీళ్లను తుడిచే వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌పై పాలకుల నిర్లక్ష్యం పన్నెండేళ్లుగా కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమై 12 ఏళ్లు అవుతున్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా దారి వైపు తిరిగి చూడలేదు. కనీసం ప్రాజెక్టును ప్రారంభించిన రోజును కూడా గుర్తు చేసుకోవడం లేదు. 2018లో టీడీపీ హయాంలో ప్రాజెక్ట్ అభివృద్ధికి జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) సంస్థ రూ.20 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించగా ఆ నిధులను వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- వీఆర్ఎస్‌పీ నిర్వహణపై కొనసాగుతున్న వివక్ష
- జైకా నిధులు ఖర్చు చేసినా మెరుగుపడని పరిస్థితి
- ప్రాజెక్టు నీటి యాజమాన్య సంఘం ఏర్పాటులో జాప్యం
- మరమ్మతులకు గురైన పంట కాల్వలు
- ఆందోళన చెందుతున్న రెండు మండలాల రైతులు
- ప్రాజెక్టు ప్రారంభించి నేటికి 12 ఏళ్లు

టీడీపీ హయాంలో రూ.19.5కోట్ల జైకా నిధులు

కొత్తపల్లి, ఆత్మకూరు మండలాల్లోని 13గ్రామాల పరిధిలోని సుమారు 12వేల ఎకరాలకు సాగునీరందించేలా ప్రాజెక్ట్‌ను స్థిరీకరించేందుకు జపాన్ దేశానికి చెందిన జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) సంస్థ ముందుకొచ్చింది. 2017 నవంబర్‌లో, 2018 మార్చిలో జైకా ప్రతినిధులు వీఆర్ఎస్పీని సందర్శించి ప్రాజెక్ట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించారు. వీఆర్ఎస్పీకు శాశ్వతంగా ఆయకట్టు స్థిరీకరణ చేపట్టడమే కాకుండా ప్రాజెక్ట్ నిర్వహణ కూడా సజావుగా ఉండాలని జైకా ప్రతినిధులు నిధులు విడుదల చేశారు. గత వైసీపీ హయంలో జైకా నిధులను ఖర్చు చేసినా పురోగతి కనిపించలేదు.



వీఆర్ఎస్పీ క్రస్టు గేట్లు



నీటితో కళకళలాడుతున్న జలాశయం

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

వర్షాభావ పరిస్థితులతో ఏటా నష్టపోతున్న వీఆర్ఎస్పీ ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయంలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకంలో భాగంగా వెలుగోడు జలాశయం నుంచి సిద్ధాపురం చెరువులోకి చేరిన నీటిని గ్రావిటీ కెనాల్‌తో ఇందిరేశ్వరం, వడ్లరామాపురం మీదుగా కొట్టాలచెరువు గ్రామ సమీపంలోని వీఆర్ఎస్పీ ప్రధాన కాల్వకు అనుసంధించాలని భావించారు. ఇందుకు సంబంధించి రూ.25కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రణాళిక అంచనాలు సిద్ధం చేసినప్పటికీ వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. శిల్పా చక్రపాణిరెడ్డి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కృష్ణానది నుంచి వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్‌కు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి విస్మరించారు. ఇదిలావుంటే గత ఎన్నికల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కూడా వీఆర్ఎస్పీ ఆయకట్టు స్థిరీకరణకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయకట్టు రైతాంగం కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశలు పెట్టుకుంది.



లైనింగ్ లేని పంట కాలువలు



వీఆర్ఎస్పీకి చేరుకునే బీటీ రహదారి దుస్థితి ఇలా

వరదరాజస్వామి ప్రాజెక్టు నిర్వహణలో లోపాలు ..

- ప్రాజెక్ట్ నుంచి ప్రధాన కాల్వల గుండా ప్రవహించే సాగునీటి కాల్వలకు రివిట్‌మెంట్ లేకపోవడంతో నీటి వృథా అధికంగా వుంది.
- ప్రధాన కాల్వల గుండా గేట్ల ఏర్పాటు, డివైడర్లు, చెక్‌డ్యాంల నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.
- పంటపొలాలకు చేరుకునేందుకు కాల్వపై అక్కడక్కడ ఏర్పాటు చేయాల్సిన వంతెనల నిర్మాణాలు జరగలేదు. దీంతో పలు గ్రామాల రైతులు కాల్వపై రాకపోకలు జరిపేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.
- పంటకాల్వల్లో పూర్తిస్థాయిలో పూడిక నిల్వ వుండి ప్రవాహ మార్గానికి అంతరాయం కల్గిస్తున్నప్పటికి ఈ సమస్య కూడా రైతులకు జటిలంగా వుంది.
- ప్రాజెక్ట్ నిర్వహణలో భాగంగా జనరేటర్ ఏర్పాటు చేయాల్సి వుంది.
- అన్ని గ్రామాలకు సంబంధించి ప్రధాన కాల్వ నుంచి నీటి సరఫరా జరిగే పంటకాల్వల్లో పూడికకు అధికమైంది. పూడిక తీసి రివిట్‌మెంట్ ఏర్పాటు చేయాల్సి వుండగా నిధుల కొరత వెంటాడుతోంది.
- ప్రాజెక్ట్‌ను చేరుకునేందుకు వున్న రహదారిపై పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ దీనిపై అధికారులు చర్యలు తీసుకోలేదు.
- ప్రత్యేకించి పంటకాల్వల ఏర్పాటులో భూములను నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇవ్వకపోవడంతో వారు తమ పొలాల్లో వున్న కాల్వలను పూడివేశారు. దీంతో దిగువ ఆయకట్టుకు నీరెళ్లే అవకాశమే లేదు.
- ప్రాజెక్ట్ నీటి యాజమాన్య సంఘం ఏర్పాటులో జాప్యం కొనసాగుతూనే వుంది. తద్వారా రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేయకపోవడంతో ప్రాజెక్ట్ నిర్వహణకు ఆటంకంగా మారుతోంది.
- సిద్ధాపురం జలాలను గ్రావిటీ ద్వారా వీఆర్ఎస్పీ ప్రధాన కాల్వలకు నీటిని చేర్చవచ్చు. అయితే ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించడం లేదు.
- వీఆర్ఎస్పీ ప్రాజెక్ట్ నిర్వహణలో పనిచేస్తున్న అధికారులెవరూ బాధ్యతగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డ్యూటీలకు హాజరు కాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ప్రాజెక్ట్ నిర్వహణ అధ్వానంగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

స్థలం ఇచ్చే ప్రసక్తే లేదు..!



(5వ పేజీ తరువాయి)

2012లో రోడ్డు వెడల్పులో భాగంగా కర్నూలు జీజీహెచ్ నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు కొంత స్థలాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఆసుపత్రి మెడికల్ కాలేజీలోని కాంపౌండ్, పరిపాలన విభాగం భవనాలు, మైదానం మొదలుకొని దాదాపు పది అడుగుల మేర లోపలికి జరిగాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఎగ్జిట్ గేట్, ఇన్‌గేట్‌ల మధ్య ఈ ఎనిమిది షాపులు ఉన్నాయి. ఆ షాపుల కారణంగా రహదారి ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఈ షాపులను తొలగించాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్న తొలగించే షాపులకు ప్రత్యామ్నాయంగా మెడికల్ కాలేజీకి చెందిన ఎనిమిది సెంట్లను ఇవ్వాలన్న మున్సిపల్ అధికారుల ప్రతిపాదనలపైనే వైద్యులు, జూనియర్ డాక్టర్లు భగ్గుమంటున్నారు. గతంలో కాలేజీ స్థలాన్ని వదులుకున్నామని, ఇప్పుడు షాపుల కోసం స్థలాన్ని ఇవ్వడం కుదరదని తేల్చి చెబుతున్నారు. గతంలోనే ఆసుపత్రి, కాలేజీ గ్రౌండ్ స్థలాన్ని వదులుకున్నామని, ఇప్పుడు షాపులకు మళ్లీ స్థలం ఇవ్వడం కుదరదని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెబుతున్నారు. అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఖాళీ స్థలాన్ని ఇచ్చేది లేదు



కర్నూలు మెడికల్ కాలేజీలోని ఇన్‌గేట్ కుడి వైపున ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ఖాళీ స్థలాన్ని షాపుల నిర్మాణానికి ఇచ్చేది లేదు. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాన్ని షాపులకు ఇవ్వాలని ప్లానింగ్ లెటర్‌ను తీసుకు వచ్చారు. దీనిపై రిప్లయ్ లెటర్‌ను రాసి తమ అభిప్రాయాన్ని తెలియజేస్తాం. ఇప్పటికే కాలేజీ వద్ద ఇన్‌గేట్, అవుట్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. ఇన్‌గేట్ పక్కన షాపులు కడితే ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకలకు, విద్యార్థులు, వైద్యులకు ఇబ్బందిగా మారుతుంది. ఖాళీ స్థలంలో ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల కోసం కామన్ రూమ్‌ను ఏర్పాటుకు స్థలం కేటాయించాం. ఆ స్థలాన్ని ఇతరులకు ఇవ్వడం కుదరని పని.

– డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

కాలేజీ స్థలాన్ని ఎలా ఇస్తారు?



మెడికల్ కాలేజీలోని స్థలాన్ని షాపులకు ఎలా ఇస్తారు. దీన్ని పూర్తిగా మేము వ్యతిరేకిస్తున్నాం. కర్నూలు బోధనాసుపత్రి రాయలసీమలోనే అతి పెద్దది. ప్రతిరోజూ మూడు వేల మంది ఓపీకి వస్తుంటారు. 1250 మంది వైద్య విద్యార్థులు, 300 మందికి పైగా డాక్టర్లు పని చేస్తుంటారు. ఇంత పెద్దాసుపత్రికి వసతులు, సౌకర్యాల కోసం స్థలం ఎంతో అవసరం. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం విద్యార్థులకు భవనాలు, తరగతులు, కామన్ రూములు ఎంతో అవసరం. కాలేజీ అవసరాలకు రాకుండా బయటి షాపులకు స్థలాన్ని ఇస్తే వైద్యులు, జూనియర్ డాక్టర్లను కలుపుకుని ఉద్యమిస్తాం. కాలేజీని కాపాడుకుంటాం.

– డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, అధ్యక్షులు, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం

సమ్మెలోకి వెళ్తాం



కాలేజీ స్థలాన్ని బయటి సంస్థలు, బయటి వ్యక్తులకు అప్పగిస్తే సహించేది లేదు. ఇప్పటికే ఆసుపత్రి మెడికల్ కాలేజీ మెన్స్ హాస్టల్ రోడ్డు వెడల్పు పేరుతో చాలా స్థలాన్ని కోల్పోయాం. కాలేజీ ఇన్‌గేట్ దగ్గర ఉన్న ఖాళీ స్థలాన్ని షాపులకు ఇస్తే జూనియర్ డాక్టర్లందరూ విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తాం. ఆందోళనలు చేపడుతాం. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను కలిసి మా అభిప్రాయాన్ని వ్యక్తం చేసి వినతి పత్రం సమర్పించాం.

– డాక్టర్ జగదీష్, అధ్యక్షుడు, ఏపీ జూడాల సంఘం, కర్నూలు జీజీహెచ్

బాల్య వివాహాలను అరికట్టాలి

కర్నూలు లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం దురాచారమని.. దాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది కోరారు. బాల్య వివాహాల విముక్త భారత్ ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో ఒక అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకంగా మారిపోతాయని తెలిపారు. ఆ తర్వాత జిల్లా కోర్టు ఆవరణ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి, సీడీపీవో అనురాధ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్నేహలత, కర్నూలు డీసీపీవో శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగంలతో పాటు పలువురు ఎన్జీవోలు, విద్యార్థులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



బాల్య వివాహాల వ్యతిరేక ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ ప్రధాన అధికారి జి.కబర్ది

మఠం హుండీ లెక్కింపు ప్రారంభం

మొదటి రోజు ఆదాయం రూ.3.56 కోట్లు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మఠం 31 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం లెక్కింపును బుధవారం ప్రారంభించినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్‌లు తెలిపారు. అక్టోబరు 26వ తేదీ నుంచి నవంబరు 26 రోజులకు సంబంధించిన 31 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించినట్లు తెలిపారు. మొదటి రోజు లెక్కింపులో రూ.3,56,32,674 నగదు వచ్చినట్లు చెప్పారు. ఇందులో 174.500 గ్రాముల బంగారు, 1.270 కేజీల వెండి ఆభరణాలు భక్తులు సమర్పించారని తెలిపారు. రెండో రోజు గురువారం హుండీ లెక్కింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్‌లు అనంత పురాణిక్, రవి కులకర్ణి, విజయేంద్ర ఆచార్, ఆడిటర్ మోహన్‌రావు, జేసీ స్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, గురురాజ్‌లు పాల్గొన్నారు.



హుండీని లెక్కింపును పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు

బ్యాలెట్ ఓటింగ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం కొట్టివేత

ఈవీఎంలపై విమర్శలు చేయవద్దు : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని పునఃప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసినట్లు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయని కలెక్టర్ పి.రంజిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్ పై పిటిషనర్ డాక్టర్ కేఏ పాల్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందన్నారు. పిటిషన్‌ను తిరస్కరించిన సందర్భంగా న్యాయస్థానం కీలక వాఖ్యలుచేసింది. ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తిచూపింది. పిటిషనర్ వాదనల్లో ఎలాంటి మెరిట్‌ను కనుగొనలేదని, ఎన్నికల్లో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టర్ వెల్లడించారు. సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎవరూ ఈవీఎంలపై విమర్శలు చేయొద్దని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలియజేశారు. ఎవరైనా ఈవీఎంలపై అనవసరమైన ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై మంత్రి టీజీ భరత్ వాంగ్మూలం

కర్నూలు లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తన పరువుకు భంగం కలిగించేలా ప్రకటనలు ఇచ్చారంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ బుధవారం కర్నూలు కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. 2023 ఆగస్టు 3న నాటి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా తాను నిధులను దుర్వినియోగం చేసినట్లు తప్పుడు ప్రకటనలు ఇచ్చి తన పరువుకు భంగం కలిగించారని మంత్రి టీజీ భరత్ గతంలో కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌లో ఆయన ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ సరోజనమ్మ ముందు వాంగ్మూలం ఇచ్చారు. మంత్రి ఇచ్చిన వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసి తదుపరి విచారణకు కేసును డిసెంబరు 16కు వాయిదా వేశారు.

బాల్య వివాహ విముక్త్ కోసం కృషి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ విముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో బాల్య వివాహ విముక్త్ భారత్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు అమ్మాయిలకు, 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టవిరుద్దమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, డీసీపీవో శారద, ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో రాజగోపురాల నిర్మాణం

ఫిబ్రవరిలో ప్రారంభానికి సన్నాహాలు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో రూ.30 కోట్లతో నాలుగు రాజగోపురాలు, ధ్వజస్తంభం, గణపతి, నవగ్రహ విగ్రహాల ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. బుధవారం రాఘవేంద్రస్వామి మఠం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం రాఘవేంద్రస్వామికి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ప్రధాన అర్చకులు ఈరప్ప, మహాదేవప్ప, బూదన్న తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌తో ఏఏవో మాధవశెట్టి, ప్రధాన అర్చకులు

ఉల్లి ఎగుమతులకు బ్రేక్

- పశ్చిమ బెంగాల్ వద్ద సరిహద్దులు మూసివేత
- ఎక్కడికక్కడే ఉల్లి లారీలను నిలిపివేసిన వైనం
- రూ.5వేల నుంచి రూ.మూడున్నర వేలకు పతనం



కర్నూలు మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ రైతు పేరు సీమోన్. జులేకల్ గ్రామానికి చెందిన ఈయన 15 బస్తాల ఉల్లిని బుధవారం అమ్మకానికి కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాడు. మూడు రోజుల నుంచి మార్కెట్ యార్డులకు ఉల్లి విక్రయానికి తక్కువగా వస్తున్నందున ధర బాగా పలుకుతుందని ఆశించాడు. అయితే.. చావు కబురు చల్లగా చెప్పారు. ఇప్పటి దాకా విదేశాలకు సప్లయ్ అవుతున్న ఉల్లి ఎగుమతులు ఆగిపోయాయని వ్యాపారులు చెప్పారు. బంగ్లాదేశ్‌కు ఉల్లి లారీలు ఎగుమతి కాకుండా కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ వద్ద లారీలను నిలిపివేసింది. దీంతో కర్నూలు మార్కెట్ యార్డు నుంచి ఉల్లి ఎగుమతులకు బ్రేక్ పడింది. మొన్నటి దాకా రూ.4వేల నుంచి రూ.5వేల దాకా క్వింటం ఉల్లి అమ్ముడుపోయింది. ఎగుమతులు ఆగిపోయాక ఒక్కసారిగా క్వింటంపై రూ.1000 దాకా ధర తగ్గిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు అనంతపురం, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ జిల్లాల నుంచి కర్నూలు యార్డుకు ఉల్లిని తీసుకువస్తున్న రైతులు దీని వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు

మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఉల్లి పంట దిగుబడి తగ్గిపోవడంతో కర్నూలు, నంద్యాల జిల్లాల ఉల్లికి గతంలో ఎన్నడూ లేని విధంగా డిమాండ్ పెరిగింది. 10వేల క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి వచ్చినా గరిష్ఠ ధర రూ.4500 నుంచి రూ.5వేల వరకు ధర అందింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఉల్లి ధరను నియంత్రించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేసే ఉల్లిపై నిషేధం విధించింది. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి సప్లయ్ అవుతున్న ఉల్లి లారీలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఈ పరిణామం వల్ల ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డుకు కేవలం రూ.2వేల నుంచి రూ.3వేల క్వింటాళ్లు మాత్రమే అమ్మకానికి వస్తున్నది.

కనీస స్థాయికి ధర పతనం:

గత శుక్రవారం క్వింటం ఉల్లికి గరిష్ఠ ధర రూ.5,099. బుధవారం రూ.4వేల గరిష్ఠ ధర నుంచి రూ.500 కనిష్ఠ ధరకు పడిపోయింది. రానున్న రోజుల్లో మరింతగా ధర పడిపోవచ్చని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉల్లి ఎగుమతులు నిలిచిపోయాయి



ఇప్పటి దాకా గతంలో ఎన్నడూ లేని విధంగా కర్నూలు యార్డులో ఉల్లికి మంచి ధర లభించింది. అయితే.. బంగ్లాదేశ్‌కు ఉల్లిని ఎగుమతి నిషేధించారని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నిషేధం ఎంత వరకు ఉంటుందో చెప్పలేం. మహారాష్ట్ర నుంచి వివిధ రాష్ట్రాలకు ఇప్పుడిప్పుడే ఉల్లిని ఆ రాష్ట్ర రైతులు తీసుకుని వస్తున్నారు. దీనివల్ల కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లికి ధర ఏ స్థాయిలో అందుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా రైతుకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకుంటాం. **- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ**

ఎక్సైజ్ పోలీసులకు పరామర్శ

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ సీఐ సుభాషిణి, ఎస్ఐ మారుతీప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ వెంకట రాముడు, మరో కానిస్టేబుల్‌ను ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ కుమార్ పరామర్శించారు. బుధవారం ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగంలోని పని చేస్తున్న సదరు సీఐ తన బృందంతో సారా, అక్రమ మద్యానికి సంబంధించి దాడుల నిమిత్తం వెళ్తుండగా జిల్లాలోని పత్తికొండ పరిధిలో జీపు బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలు కాగా, సీఐ, హెచ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయని సీఐ చంద్రహాస్ తెలిపారు.

మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

నంద్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన నంద్యాల పట్టణానికి చెందిన ఎస్.కరీముల్లా అనే వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష పడినట్లు వన్‌టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. కరీముల్లా మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం 7రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ వెల్లడించారు. ఈ మేరకు అతడిని నంద్యాల జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

టైరు పగిలి కారు బోల్తా

- ఎక్సైజ్ సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న సీఐ

దేవనకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టైరు పగిలి కారు బోల్తా పడిన ఘటనలో ఎక్సైజ్ సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దేవనకొండ- పత్తికొండ రహదారిపై వెలమకూరు సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఏపీ ఎన్ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సీఐ సుభాషిణి తమ సిబ్బందితో కలిసి తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద తనిఖీలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవనకొండకు మూడు కిలోమీటర్ల దూరంలో టైరు పగలడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఎక్సైజ్ సీఐ సుభాషిణి, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాముడు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ మారుతి, డ్రైవర్ వంశీలతోపాటు మరొకరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డు శిథిలమై గుంత ఏర్పడటంతో వేగంగా వెళ్తున్న కారు టైరు అందులోపడి పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి వేగంలో పల్టీలు కొట్టి హంద్రీనీవా కాలువలోకి దుసుకెళ్లింది. ప్రమాద సమయంలో అద్దాలు ధ్వంసమై అందులో నుంచి సీఐ సుభాషిణి గాల్లో ఎగిరిపడిన్నట్లు సమీప పొలాల రైతులు తెలిపారు. క్షతగాత్రులను స్థానిక వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు అంబులెన్స్‌లో తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త కొడవలితో గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాంపల్లిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. రామలింగాయపల్లెకు చెందిన పెద్దయ్య, రామాంజినమ్మల కుమార్తె సరోజ(35)ను రాంపల్లికి చెందిన ఓబులయ్య, కాశమ్మల రెండో కుమారుడు రామానాయుడుకు 18 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. గత కొన్నేళ్ల క్రితం భార్యాభర్తలు మనస్పర్థలతో విడిపోయి ఎవరికి వారు జీవనం చేస్తున్నారు. సరోజ అదే గ్రామంలోనే సొంత ఇల్లు కొనుగోలు చేసి బట్టల షాపు పెట్టుకుని జీవనం చేస్తుండేది. అయితే సరోజపై అనుమానం పెంచుకున్న భర్త రామానాయుడు ఇంట్లోనే గొంతు నరికి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలు విచారణ చేపట్టారు. మృతురాలు సోదరుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

నందవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకవీడు గ్రామంలో సోమమ్మ(44) బుధవారం ఉరి వేసుకుని ఆత్మాహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కనకవీడు గ్రామానికి చెందిన కురవ నరసింహ భార్య సోమమ్మ కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా క్యాన్సర్ అని డాక్టర్లు తెలిపారు. దీనికితోడు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆ నొప్పి భరించలేక ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పెద్ద కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు

హొళగుంద, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హొళగుంద లోని నాయిబ్రాహ్మణ వీధికి చెందిన ఈడిగ విరూపాక్షి అనే రైతు పొలంలో విద్యుదాఘానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధువారం జరిగింది. పొలంలో వరి నారు మడి వేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కి పనులు చేస్తుండగా ట్రాక్టర్‌కు అడ్డంగా ఉన్నాయని విద్యుత్ తీగలను తొలగిస్తుండగా కరెంట్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అక్రమార్కులను వదిలేది లేదు

- కార్యకర్తలే టీడీపీకి వెన్నుదన్ను
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే నియోజకవర్గానికి రూ.25 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలోనే పట్టణంలో మిని రింగ్ రోడ్డు కోసం, నాన్ అమృత్ స్కీం, మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబును ఒప్పించి నిధులు సమీకరిస్తానని తెలిపారు. గత వైసీపీ హయాంలో ఐదేళ్ల పాలనంతా ఆర్భాటాలే తప్ప ఆచరణ లేదని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించనప్పటికీ రూ.12లక్షల కోట్ల అప్పులు కావడంతో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి జగనన్న కాలనీలుగా మార్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇళ్లపట్టాలు కోల్పోయిన లబ్దిదారులందరికి ఇళ్లపట్టాలను అందజేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. టీడీపీకి కార్యకర్తలే బలమన్నారు. కష్టకాలంలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 7న ఆత్మకూరులో జరిగే తబ్లిగీ ఇజితెమాకు పూర్తి సహకారం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, గోవిందరెడ్డి, వంగాల శివరామిరెడ్డి, తిరుపమయ్య, వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రాజేంద్రరెడ్డి, గౌస్‌లాజం, కలిముల్లా, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నేరాల నివారణపై అవగాహన

నంద్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళా సంబంధిత నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ క్రైం, డ్రగ్స్, లోన్‌యాప్ మోసాలు, రోడ్డు భద్రతా నియమాలపై పాఠశాలల విద్యార్థులకు పోలీస్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. డ్రగ్స్, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, బాలికల సంరక్షణ చట్టం,సైబర్ క్రైం,రహదారి భద్రత నియమాలపై వివరించారు. ఆడపిల్లలు, మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నట్లయితే డయల్ 100 లేదా 112కు ఫోన్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ

యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజు



చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్‌బీ ఎస్ఐ

ఎమ్మిగనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు సెల్ఫీ తీసుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎద్దుల మార్కెట్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌బీ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఎమ్మిగ నూరు మండలం కడివెళ్ల గ్రామానికి చెందిన రాముడు పట్టణం లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. అయితే వ్యక్తిగత సమస్యలతో జీవితంపై విరక్తి చెంది సెల్ఫీ తీసుకుంటూ విషం తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ వీడియో కాస్తా కర్నూలులోని ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజుకు చేరింది. ఎస్ఐ వెంటనే విద్యార్థి రాముడు లోకేషన్ కోసం సైబర్ ల్యాబ్ టెక్నికల్ పోలీసుల సహాయంతో సాంకేతిక నైపుణ్యంతో గుర్తించారు. విద్యార్థి రాముడు స్నేహితులు, బంధువులను అలర్ట్ చేయటంతో చేరుకొని కాపాడారు. ఎమ్మిగనూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రాముడును ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజు పరామర్శించారు. కాగా సమాచారం అందిన వెంటనే చాకచక్యంగా విద్యార్థిని కాపాడిన స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్ రాజును ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

వివాహ వేడుకలో విషాదం



బాలుడి మృతికి కారణమైన డీజే వాహనం, ఇన్‌సెట్‌లో మనోజ్(ఫైల్)

- బాలుడి తలపై ఎక్కిన డీజే వాహనం
- అక్కడికక్కడే దుర్మరణం
- సజ్జలగుడ్డం గ్రామంలో ఉద్రిక్తత

కోసిగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో వివాహ వేడుకలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. పెళ్లి పూర్తయి మెరవణి కోసం ఏర్పాటు చేసిన డీజే వాహనం కింద పడి మనోజ్(7)అనే బాలుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు... సజ్జల గుడ్డం గ్రామానికి చెందిన అర్లబండ నాగేష్ కుమారుడు బసవరాజు వివాహం బుధవారం ఉదయం జరగడంతో రాత్రి 8 గంటలకు మెర వణి నిర్వహించారు. కౌతాళం మండలం ఎరిగేరి గ్రామానికి చెందిన వివాహ గుర్రాల బండి, డీజే వాహనాలను తీసుకువచ్చారు. ఈ క్రమంలో వాహనాలు అదుపుతప్పి వెనుక వైపు నుంచి బాలుడు కురువ మనోజ్‌పైకి వెళ్లాయి. దీంతో బాలుడి తలభాగం దెబ్బ తిని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కోపోద్రిక్తులైన బాలుడి కుటుంబ సభ్యులు పెళ్లి వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనతో డ్రైవర్లు, వాహన యజమానులు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. సమా చారం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాలుడి మృతికి కారణమైన పెళ్లి వాహనాలను కోసిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలుడి తల్లిదండ్రులు గోరంట్ల చంద్ర, శారదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. కాగా బాలుడు స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు.

అందుబాటులో ఇసుక డిపోలు

నంద్యాల కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరు, నంద్యాల ప్రాంతాల్లో వినియోగదారుల నిమిత్తం ఇసుక డిపోలను ప్రవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి జిల్లాస్థాయి ఇసుక కమిటీ నంద్యాల నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ప్రభుత్వ ధరకు సరఫరా చేయడానికి గనుల శాఖ మినరల్ డీలర్ లైసెన్సు మంజూరు చేశారు.

డిపోల వివరాలు:

ఆళ్లగడ్డలో సర్వే నెంబరు 113-2, పాలసాగరం గ్రామం ప్రాంతంలో రామశేఖర్‌రెడ్డి, బనగానపల్లెలో సర్వే నెంబరు 142, 143 మార్కెట్ యార్డు బనగానపల్లెలో మద్దూరు రవి ఇసుక డిపోలు నిర్వహిస్తారని చెప్పారు. నందికొట్కూరులో సర్వే నెంబరు 383,384లో ఆవుల బాల వెంకట సురేష్, నంద్యాల మండలంలో సర్వే నెంబరు 457-3 అయ్యలూరులో ఇసుక డిపో నిర్వహి స్తారని తెలిపారు. ఆళ్లగడ్డలో ఇసుక టన్ను ధర రూ.719, బనగానపల్లెలో, నందికొట్కూరు ప్రాంతాలలో ఇసుక టన్ను ధర రూ.744, నంద్యాలలో ఇసుక టన్ను ధర రూ.884గా ప్రభుత్వం నిర్ణయించింది.

ఇద్దరు రోగులకు పోయమ్ ఎండోస్కోపీ

- రాయలసీమలో మొట్టమొదటిసారి అంటున్న వైద్యులు



రోగికి పోయం ఎండోస్కోపి చికిత్స చేస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవాహిక జబ్బు అకలేషియా కార్డియో సమస్య ఉన్న ఇద్దరు రోగులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పోయమ్ (పీవోఈఎం) ఎండోస్కోపిక్ చికిత్సను బుధవారం విజయవంతంగా నిర్వహించారు. జయంతి (45), బీసేంద్ర (47) అనే ఇద్దరు రోగులకు గత రెండు మూడేళ్లుగా ఆహారం మింగడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ ఇద్దరు రోగులు కర్నూలు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చారు. ఆ విభాగపు హెచ్‌వోడీ డా.జి. మోహన్‌రెడ్డి పరీక్షలు నిర్వహించగా అన్నవాహిక కింద భాగాన పుట్టుకతో కండరం గట్టి పడినట్లు గుర్తించారు. దీని వల్ల తిన్న ఆహారం మింగలేకపోతున్నట్లు ఆయన గుర్తించారు. దీంతో ఈ ఇద్దరు రోగులకు బుధవారం ఉదయం గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలోని ఈఆర్‌సీపీ ఓటీలో హెచ్‌వోడీ డా.జి. మోహన్ రెడ్డి, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మతో కలిసి యశోద హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా. రాకేష్ కుమార్ పోయమ్ ఎండోస్కోపిక్ ద్వారా చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డా.జి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ అకలేషియా కార్డియో సమస్యకు పోయమ్ చికిత్స చేయడం రాయలసీమలో ప్రప్రథమమని అన్నారు. ఈ చికిత్సలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు డా. ప్రవీణ్ కుమార్, డా. దీపక్ రెడ్డి, డా. సుజిత్ రెడ్డి, డా. సంపత్, డా. ఆర్షియా, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా. సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా'సివిల్స్' కోచింగ్ ప్రవేశ పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని అబ్బాస్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 50 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఈ పరీక్షకు 47 మంది అభ్యర్థులు హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాన్ని డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షించారు. రాష్ట్ర స్థాయిలో మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో సివిల్ సర్వీస్ కోసం రెసిడెన్షియల్ కోచింగ్ ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ(బీఎస్ఎన్ఎల్) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా కార్యదర్శి రామరాజు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా సంఘాల పిలుపులో భాగంగా బుధవారం ప్రకాష్ నగర్‌లోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ స్టాగ్నేషన్ కారణంగా వేలాది మంది నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు అనేక ఇంక్రిమెంట్లను కోల్పోయారన్నారు. 4జీ, 5జీ ప్రారంభంలో విపరీతమైన జాప్యంతో బీఎస్ఎన్ఎల్ నాణ్యమైన డేటా సేవలు అందించలేకపోతుందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం, ఈపీ ఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, క్యాజువల్ కార్మికులకు ఏడో సీపీసీ సే స్కేల్ ఆధారంగా వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐబీడీపీఏ, బీఎస్ఎన్ఎల్ సీసీడబ్ల్యూఎఫ్, పెన్షనర్లు, కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి

కోడుమూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి గ్రామానికి చెందిన వీఆర్వో జె.సత్యరాజు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు కర్నూలులో ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం నాగలాపురం తరలించారు. విషయం తెలిసిన తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్, వీఆర్వోలు చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 25వేలు అందజేశారు. అలాగే ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం సభ్యులు మౌళిబాషా, నాగమద్దయ్య, శ్రీధర్ మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు యల్లప్ప, నారాయణ, రాఘవేంద్ర, పరమేష్, వెంకటరాముడు పాల్గొన్నారు.

నేడు రామదాసు రథోత్సవం

కోడుమూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి గ్రామంలో గురువారం రామదాసుస్వామి రథోత్సవం జరగ నుంది. రథోత్సవాన్ని తిలకించడానికి లద్దగిరితోపాటు కొండాపురం, అల్లినగరం, రామాపురం గ్రామాల ప్రజలు తరలివస్తారు. ఈవేడుకలు ఐదు రోజులపాటు జరుగుతాయి. బుధవారం రాత్రి నందికోలసేవ మేళతాళాల మధ్య వైభవంగా నిర్వహించారు.

రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వీరగండ్లలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారుల జాబితాను ఆర్గనైజింగ్ సెక్రటరీ గిడ్డయ్య ప్రకటించారు. బుధవారం స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారుడికి అభినందన

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడాకారుడు బి.ధీరజ్ కుమార్ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ +2 పోటీలకు ఎంపికై రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. కాకినాడలో నిర్వహించిన అండర్-19 ఎస్‌జీఎఫ్ హాకీ పోటీల్లో ప్రతిభ చాటాడు. డిసెంబరులో జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే 68వ స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటాలని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభినందనలు తెలిపారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం

మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్


టీజీ వెంకటేశ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయమని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం టీజీ వెంకటేశ్‌ను న్యాయవాదులు సన్మానించారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా రాయలసీమ ఐక్యవేదిక హక్కుల ఆధ్వర్యంలో తాము ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు కూడా హైకోర్టును కర్నూలులోనే ఏర్పా టు చేయాలని కూడా తాము డిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ రావడానికి నిర్ణయించిందని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ ప్రతి క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు పట్టుపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నాయకులు దాశెట్టి శ్రీనివాసులు, హరినాథ్ చౌదరి, గణేష్ సింగ్, చంద్రశేఖర్, కేఈ జగదీష్, నాగముని, మాధవి పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోండి


మాట్లాడుతున్న కర్నూలు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ శేషాద్రి

ఓర్వకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కర్నూలు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ టి.శేషాద్రి కోరారు. బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామ సచివాలయంలో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు ఆదా చేసుకో వచ్చని, ఈ పథకం కింద జాతీయ బ్యాంకులు 80 శాతం రుణాన్ని 7 శాతం వడ్డీతో అందిస్తాయని చెప్పారు. ప్రభుత్వ రాయితీ ప్రకారం ఒక కిలో వాట్ సోలార్ ప్రాజెక్టుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్‌కు రూ.60 వేలు, అలాగే 3 కేవీ నుంచి 9 కేవీ వరకు ప్రాజెక్టు విలువలో రూ.78 వేల వరకు సబ్సిడీ నేరుగా వినియోగదారుడి ఖాతాలోకి జమ అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఓర్వకల్లు విద్యుత్ శాఖ ఏఈ సునీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ కాంతారెడ్డి, గ్రామ పెద్దలు పుల్లారెడ్డి, తిరుపాలు, శివుడు, ప్రకాశం, విద్యుత్ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడే వారికే గుర్తింపు : మంత్రి భరత్


మంత్రి టీజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయీబ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికే తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం మంత్రిని నాయీబ్రహ్మణ వేల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలక వీటి విజయ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలక వీటీ విజయకుమార్ టీడీపీలో రాజకీయంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అంచెలంచలుగా ఎదిగారన్నారు. ప్రతి పక్షంలో ఉండగా వైసీపీ అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం కలిగించి పార్టీ గెలుపునకు కృషి చేశారని కొనియాడారు. సీఎం చంద్రబాబు బీసీలకు సముచిత స్థానం కల్పిస్తారని విజయకుమార్‌కు డైరెక్టర్ పదవీ రావడంతో మరోసారి నిరూపితమైందన్నారు.

టీజీ భరత్‌కు సన్మానం: కర్నూలులో హైకోర్టు బెంచ్ విషయంలో మంత్రి టీజీ భరత్ కృషి చేశారని లీగల్ సెల్ న్యాయవాదులు అన్నారు. బుధవారం నగరంలోని మంత్రి కార్యాలయంలో లీగల్ సెల్ న్యాయవాదులు కలిసి ఆయన్ను సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీజీ భరత్ చేసిన కృషి వల్ల హైకోర్టు బెంచ్ కర్నూల్లో ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కేఈ జగదీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శులు శ్రీనివాస భట్, నాగముని, ప్రసాద్, గణేష్‌సింగ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను కించపరచడం సరికాదు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లే ప్రమాదాలకు కారణమంటూ టీడీపీ సీనియర్ నాయకుడు జేసీ దివాకర్‌రెడ్డి వారిని కించపరచడం సరికాదని ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ అన్నారు. బుధవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమా దాలకు అనేక కారణాలు ఉన్నాయని, వాటిని విశ్లేషించకుండా కేవలం ఆటో డ్రైవర్లపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను ముందుగా పరిష్కరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీరామ్, మహ్మద్, చిన్నకంగాల్, ప్రసాద్, పెద్దయ్య పాల్గొన్నారు.

లింగ వివక్షను వీడాలి: ఎంపీడీవో

ఓర్వకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో లింగ వివక్షను వీడాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రం ఓర్వకల్లులో బుధవారం లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ఎంపీడీవో ఆధ్వర్యంలో పొదుపు మహిళలు, విద్యార్థినులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు కూడలి వద్ద మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈవోఆర్డీ సుబ్బరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి, వెలుగు ఏపీఎం వెంకటరామిరెడ్డి, సచివాలయ ఏఎన్ఎం మహేశ్వరమ్మ, పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావు పూలే వర్ధంతి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహిస్తున్నామని జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ సాధికారత అధికారి పి.వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక బిర్లాగేటు సమీపంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తారన్నారు. ఈకార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, బీసీ కులాల సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

నివేదికలు సమర్పించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి సంబంధించి నివేదికలు సమర్పించాలని ఇన్‌చార్జి ఈఎన్‌సీ డి.మరియన్నా కమిషనర్‌కు లేఖ రాసారు. నూతన కార్యాలయ భవన నిర్మాణం పని స్లిప్ తిరస్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. పని స్లిప్‌ను పరిశీలించిన తరువాత ఆమోదిత అంచనాతో పోల్చినప్పుడు భూమి తవ్వకాల్లో భారీ మార్పు ఉన్నట్లు గమనించామన్నారు. రాతి పరిమాణాన్ని అదనపు అంశంగా రూ.1.82 కోట్లతో చేర్చడం, దీనికి పని స్లిప్‌లో సరైన వివరాలు ఇవ్వలేదన్నారు. దీనికి సంబంధించిన నివేదిక, సూపరింటెండింగ్ ఇంజనీర్ ధ్రువీకరణతోపాటు సాయిల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టు, (మట్టి అధ్యయన నివేదిక), ఎం. బుక్స్ ద్వారా ప్రమాణీకరిం చబ డిన నివేదికను కార్యాలయంలో సమర్పించాలన్నారు.

'జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీలతో ఉచిత విద్య అందించాలని ఫొటో, వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ప్లకా ర్డులతో నిరసన తెలిపారు. జర్నలిస్టులు చెన్నయ్య, సురేష్, రమేష్, రవి, వలి, జయబాబు, ప్రసాద్, నరసింహ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

సి.బెళగల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ అల్లీపీరా అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో రామన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ అల్లీపీరా మాట్లాడుతూ మండలంలోని జాబు కార్డు ఉన్న వారు మాత్రమే ఉపాధి పనులకు హాజరుకావాలన్నారు. ఎంపీడీవో రాణెమ్మ, ఈసీ రాంగస్వామి పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికి కేఈ పరామర్శ


నాగేశ్వరరావు యాదవ్‌ను పరామస్తున్న కేఈ కృష్ణమూర్తి, తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌ను పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పరామర్శించారు. ఈనెల 25న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేశ్వరరావు యాదవ్ త్వరగా కోలుకోవాలన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రిటైర్డ్ ఐజి, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని జడ్పీ (బాలురు, బాలికలు) పాఠశాలల్లో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం ఆధ్వర్యంలో జరిగిన స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ హాజరై విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. అలాగే విద్యార్థుల చదువు కోసం ఉపయోగపడే చార్ట్స్, గ్లోబ్స్, మెటీరియల్స్ కోసం ఒక్కొక్క పాఠశాలకు రూ.10వేల చొప్పున రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో రెండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, జె వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయఅధికారి మల్లేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని సంగాల, గుండ్రేవుల గ్రామాలలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు గంజాయి సాగుచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు రైతులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో కొళాయి పన్ను వసూలు చేయని అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ నగర పాలక కమిషనర్‌కు మెమో జారీ చేశారు. 2023-2024కు సంబంధించి (3.1.2024) వరకు రూ.14.95 కోట్లు పెండింగ్‌లో ఉందని, వాటిని ఎందు కు వసూలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. కొళాయి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని మెమోలో పేర్కొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ

సి.బెళగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని పలుకుదొడ్డి, కంబంధహల్ గ్రామాల్లో ఆయన యువకులతో సమావేశమయ్యారు. టీడీపీ నాయకులు రాజు, రాముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

1న పీఆర్‌టీయూ సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం డిసెంబరు ఒకటిన కర్నూలు టౌన్‌మోడల్ హైస్కూల్‌లో జరుగుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.


పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సచివాలయాల ఎదుట సీపీఐ ఆందోళన


సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం ఇస్తున్న రామక్రిష్ణారెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని 19, 46, 48, 50, 53 సచివాలయాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ 19వ వార్డులో సుమారు 5వేల మంది పేదలు ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో ఇళ్లు నిర్మించు కోలేక ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోక నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. అనంతరం సంబంధిత సచివాలయాల అడ్మిన్లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, ఆదిలక్ష్మి, సత్యం, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం డీఈవో కార్యాలయంలో డీఈవో శ్యామ్యూల్‌పాల్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కోనేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా తయారైందన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేసి పాఠశాలలకు తిరిగి పంపి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. అలాగే సమగ్ర శిక్ష కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులు అక్రమ మార్గాల్లో డిప్యుటేషన్ల ద్వారా పని చేస్తున్నారని, వారి డిప్యుటేషన్లను రద్దు చేసి నూతన నోటిఫి కేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి జేఏసీ నాయకులు దత్త యాదవ్, షఫీవుల్లా, కిరణ్ కుమార్, నారాయణ, విజయ్ పాల్గొన్నారు.

జాతీయ విపత్తులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారి

కర్నూలు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ (ఏపీఎస్‌డీ ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో నగర శివారులోని ఇండస్ పాఠశాల, దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిచారు. ముఖ్య అతిథులుగా ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, డీఎస్పీ సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం అగ్ని ప్రమాదాలు, వరదలు, సునామీ, భూకంపాలు, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తమ ప్రదర్శనల రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇండస్ పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్, హెచ్ఎం మీనాక్షి, సీఈఓ విల్సన్, ఆర్ఎస్ఐ మహింద్రా నాయక్ హాజరయ్యారు. అశోకా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏడీఏ


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ

కోడుమూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీలో పంట నమోదు తప్పనిసరిగా చేయించాలని ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. బుధవారం అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో వ్యవసాయాధికారి రవిప్రకాష్ అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వర్షాధారంగా సాగుచేసిన పప్పుశనగ, జొన్న మొదలగు పంటలకు పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద మీసేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేరుశనగ పూతదశలో ఎకరాకు 2 కింటాళ్ల జిప్సం వేయాలని సూచించారు. దీంతో వేరు వ్యవస్థ పెరిగి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. మొక్కజొన్న, పప్పుశనగ, వేరుశనగ పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్ర మంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌యూ కబడ్డీ మహిళా జట్టు ఎంపిక


కబడ్డీ క్రీడాకారిణులతో ఆర్‌యూ ప్రతినిధులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు ఈ నెల 29 నుంచి డిసెంబరు 2 వరకు తమిళనాడులోని కరైకుడిలోని ఆలగప్ప యూనివర్సిటీలో జరుగుతు న్నాయి. ఈ పోటీలకు రాయలసీమ విశ్వవిద్యాలయం జట్టు పాల్గొం టుంది. బుధవారం ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్టర్ డా.బోయ విజయకుమార్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా.కేవీ శివకిషోర్, యూనివర్సిటీ కబడ్డీ జట్టు మేనేజర్ పాల్గొన్నారు. ఈ జట్టులో జి.కీర్తి, డి.పద్మ, ఎం.మంచాల తేజ, ఎస్.శ్రావణి, పి.రేవతి, ఏ.సుమతి, టి.భారతి, డి.మంజుల, సి.గాయత్రీ, జి.హర్షిత ఉన్నారు.

క్రికెట్ పోటీలకు ఎంపిక



వాగి శంకర్ రెడ్డి, ధీరజ్ రెడ్డి(ఫైల్)

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఆదోని లిలాస్ పాఠశాల విద్యార్థులు వాగి శంకర్ రెడ్డి, ధీరజ్ రెడ్డి ఎంపికైనట్లు కరస్పాండెంట్ రమాదేవి, సెకటరీ ప్రతిభాబాయి తెలిపారు. బుధవారం వారిని అభినందించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

- రహదారి భద్రత సమావేశంలో సబ్ కలెక్టర్

ఆదోని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గత సమీవేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై ఆరా తీశారు. పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉందని, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిమితి మించి ప్రయాణించే వాహనాలపై కేసు నమోదు చేయాలని సూచించారు. సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళ్తున్నారని, నిఘా పెట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.

పట్టణంలోని ఆలూరు రోడ్డు మహాయోగి లక్ష్మమ్మ అవ్వ, అర్చి (ఆదోని ముఖద్వారం), గోశాల సమీపంలోని మలుపు, ఎమ్మిగనూరు బైపాస్ విమల రీజెన్సీ వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్‌లోని పోలీస్, ఆర్అండ్‌బీ, ఆర్టీవో అధికారులు ఉమ్మడిగా కలిసి బ్లాక్ స్పాట్స్, సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు చేసి పరిష్కరించాలన్నారు. ఆర్టీవో నాగేంద్ర, ఎంవీఐ శిసిర దీప్తి, ఆర్అండ్ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డీఎల్పీవో నూర్జహాన్, పాల్గొన్నారు.

ఫొటోలు తప్పనిసరి

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల ఫొటోలు తప్పనిసరిగా తీసుకోవాలని ఏపీవో హేమ సుందర్, ఈసీ ప్రదీప్ కుమార్ సూచించారు. బుధవారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వచ్చే ఏడాది చేయబోయే పనులను ఈ సంవత్సరమే గుర్తించాలని, పనులను రైతులకు ఉపయోగపడలా ఉండాలన్నారు. పనుల ప్రారంభంలో ఒకటి, చేసేటప్పుడు ఒక ఫొటో తీయాలన్నారు.

పబ్లిక్ నోటీస్

తేది:28-11-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ **ప్రాజెక్ట్ ఎలివేన్ రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు** వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లైయింట్ వారికి భూములు అమ్మటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, బదిలీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిగేజ్, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు, తనఖా, సదలింపు, రూపకల్పన, డిక్రెస్ట్, హైపోతికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. నం	రైతు పేరు	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	సేల్ ల్యాండ్	గ్రామం	మండలం
1	కె. శివప్రసాద్‌రెడ్డి S/o కె.పాండురంగారెడ్డి	184	9.28	1.04	ఆస్పరి	ఆస్పరి

బి. శివక్రిష్ణ, అడ్వకేట్, షాప్ నెం.3, 4వ ఫ్లోర్, స్కంద బిజినెస్ పార్క్, అబ్బుల్లా ఖాన్ ఎస్టేట్, కర్నూలు. సెల్ : 8008086291

పబ్లిక్ నోటీస్

తేది:28-11-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ **ప్రాజెక్ట్ సిక్స్‌టీన్ రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు** వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లాయింట్ వారికి భూములు అమ్మటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, బదిలీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిగేజ్, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు, తనఖా, సదలింపు, రూపకల్పన, డిక్రెస్ట్, హైపోతికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. నం	రైతు పేరు	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	సేల్ ల్యాండ్	గ్రామం	మండలం
1	చాకలి లక్ష్మి W/o శ్రీనివాసులు	713-E	2.05	0.60	ఆస్పరి	ఆస్పరి
	చాకలి సరోజమ్మ W/o గుండన్న	713-E	2.04	0.44	ఆస్పరి	ఆస్పరి
2	జలీల్ S/o కట్టుబడి ఈసా	16	6.08	0.64	హోసూరు	పత్తికొండ
	ఖలీల్ S/o జియావుద్దీన్	16	6.08	0.40	హోసూరు	పత్తికొండ
3	బాషా సాబ్ S/o మాబూ సాబ్	617-A	0.64	0.21	ఆస్పరి	ఆస్పరి
	వలి బాషా S/o చిన్న షేక్ సాబ్	617-A	1.34	0.83	ఆస్పరి	ఆస్పరి
4	మేకల రాజేష్ S/o యం. వెంకటేశ్వర్లు	699-D	4.54	0.34	మొలగవల్లి	ఆలూరు
	మేకల మంగమ్మ W/o వెంకటేశ్వర్లు	699-D	4.50	0.70	మొలగవల్లి	ఆలూరు
5.	ముత్యాలమ్మ W/o సి.డి. వెంకటేశ్వర్లు	641-C	5.00	1.04	నేమకల్	చిప్పగిరి

బి. శివక్రిష్ణ, అడ్వకేట్, షాప్ నెం.3, 4వ ఫ్లోర్, స్కంద బిజినెస్ పార్క్, అబ్బుల్లా ఖాన్ ఎస్టేట్, కర్నూలు. సెల్ : 8008086291

మెప్మా బజార్ ఏర్పాటు చేస్తాం

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

● మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలన

ఎమ్మిగనూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో మెప్మా బజార్, సూపర్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో పొదుపు మహిళలు సొంతంగా తయారు చేసిన బ్యాగులు, దుస్తులు, చెట్నీలు, మహిళల దుస్తులు, టవల్స్ దోమతెరలు, బెడ్‌షీట్స్, మిఠాయిల స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూణాలను రూ. 5లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. పొదుపు గ్రూపు మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించి మరింత ఆదాయం పొందేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మిగనూరులో కూడా పొదుపు మహిళలు సృజనాత్మకతతో సొంతంగా జనపనారతో బ్యాగులతో పాటు ఇతర వస్తువులు తయారు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గంగిరెడ్డి, మెప్మా పీవో జయవర్ధన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, నాయకులు నరసింహులు, టీడీపీ నాయకులు బచ్చాల రంగన్న, జహంగీర్,ఉరుకుంద, నాగరాజు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

డి. బెళగల్‌లో సీసీ రోడ్డుకు భూమి పూజ

కోసిగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ మాల పద్మమ్మ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు సోల్మాన్ రాజు, రామయ్య, రాజశేఖర్ రెడ్డి, హుశేనీ, సూర్యప్ప గౌడు, బసవ, బాలస్వామి, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్

ఎమ్మిగనూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా వచ్చేనెల 5నుంచి పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న జట్లు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ జనవరి 15న ఉంటుందన్నారు. గెలుపొందిన విన్నర్ జట్టుకు రూ. 2లక్షలు, రన్నర్ జట్టుకు రూ. లక్ష నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళల కోసం పోరాడతా



మంత్రి లోకేశ్‌ను కలిసిన రామలక్ష్మి

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టేందుకు పోరాడతానని టీడీపీ అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి అన్నారు. ఆమె మంత్రి లోకేశ్‌ను కలిసి తనకు మహిళా కమిషన్ సభ్యురాలిగా అవకాశమివ్వాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. స్పందించిన మంత్రి పరిశీలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు

ఆలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో రాజకీయలపై రెచ్చగొట్టే పోస్టు పెడితే కేసులు నమోదు చేస్తామని ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్లు చేసి అకౌంట్, ఆధార్ నంబరులు అడిగితే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిం చాలన్నారు. గ్యాంబ్లింగ్, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని సూచించారు.

బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున సూర్య

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లోని ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ రీజినల్ ఇన్‌చార్జి మోపూరి సూర్య ఎరుకల కోరారు. బుధవారం కర్నూలులో కలెక్టర్ రంజిత్ భాషాకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దళిత గిరిజన యువతీ, యువకులు ఇంటర్, డిగ్రీ చదివి ఉద్యోగాలు లేక గత ప్రభుత్వ హయాంలో రూ.5వేలకే వలంటీర్లుగా పని చేశారన్నారు. వ్యవస్థ రద్దు కావడంతో ఖాళీగా ఉండి ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లుగా బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ కాలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరామన్నారు. జిల్లా అధ్యక్షులు కుశలన్న, సురేష్ , సునీల్ కుమార్, రాముడు, వెంకటేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి : ఏవో

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చలి పెరగడంతో రైతులు శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రవి సూచించారు. బుధవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో శనగ పంటను పరిశీలించారు. పచ్చ రబ్బరు, శనగ పచ్చ, లద్దె పురుగులు ఆశించాయని నివారణకు వ్యవసాయాధికారుల సూచనలమేరకు మందులు వాడాలన్నారు. వాతావరణ మార్పుల కారణంగా శనగ, వాము ఆకులు పసుపుపచ్చగా మారాయాని తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలన్నారు. జాకీర్, రైతులు ఉన్నారు.

'వర్గాలు వీడి పార్టీ అభివృద్ధికి పనిచేస్తాం'


మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్, గుమ్మనూరు నారాయణ

ఆలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో వర్గాలు వీడి పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేస్తామని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం ఆలూరులో మాట్లాడుతూ గురువారం చిప్పగిరి మండలం గుమ్మనూరులో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామన్నారు. నాయకులందరినీ ఒక్క తాటిపైకి తెస్తామన్నారు. సమావేశంలో భీమప్ప చౌదరి, బిల్లేకల్ వెంకటేష్, సీనప్ప, అనుమయ్యా, నాగరాజు, కృష్ణ యాదవ్, ప్రకాశ్, భీమా లింగ, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పనిభారాన్ని తగ్గించండి

- సబ్ కలెక్టర్‌ను కోరిన సచివాలయ ఉద్యోగులు


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ఆదోని రూరల్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పనిభారంతో సిబ్బంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారని సచివాలయ జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం జంబులదిన్నె గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ పల్లె హరినాథ్‌రెడ్డి బలవన్మరణానికి పాల్పడటంపై బుధవారం రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పనిభారాన్ని తగ్గించాలని కుటుంబాన్ని ఆదుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు అరుణ, ప్రణతి, అనీత, వీరేష్, రుద్రగౌడ్, రాజేష్, హనుమేష్, వేణుగోపాల్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయవాది లలిత జితేందర్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని న్యాయవాది లలిత జితేందర్ అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు సైబర్ నేరాలు చట్టాలపై ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. మోసపు కాల్స్‌చేసి దుండగులు బెదిరించి డబ్బులు దండుకుంటున్నారన్నారు. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. తెలియని లింకులను మొబైల్‌లో ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ వీక్లిఫ్, ఉమాదేవి, వెంకట్రాంరెడ్డి, మధు, వెంకటేశ్వరులు, సంతోషి పాల్గొన్నారు.

కేసులో ఇరికించారు

- వ్యభిచారం కేసులో మైనర్‌ను చేర్చడంపై కుటుంబ సభ్యుల నిరసన

పత్తికొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో మైనర్ బాలుడిని ఇరికించారని ఆ బాలుడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేశారు. పట్టణంలో మంగళవారం వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి మహిళతో పాటు పలువురిని అరెస్టు చేశారు. అందులో పట్టణానికి చెందిన ఓ బాలుడు కూడా ఉన్నాడు. అయితే కేసుతో సంబంధం లేని తమ బాలుడిని సీఐ జయన్న ఇరికించారంటూ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. డీఎస్పీ వెంకట్రామయ్య చేరుకుని సమస్య పరిష్కరిస్తానని నచ్చజెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

ఈ విషయమై సీఐ జయన్నను వివరణ కోరగా.. సమాచారం మేరకే వ్యభిచార గృహంపై దాడిచేసి, పలువురిని అదుపులోకి తీసుకున్నామని, ఎవరినీ ఉద్దేశపూర్వకంగా కేసులో ఇరికించలేదన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పత్తికొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నయామున్నీసా బీ పిలుపు నిచ్చారు. బుధవారం జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలతో సమస్యలు వస్తాయన్నారు. ఎక్కువగా గ్రామాల్లో ఇవి జరుగుతున్నాయని, నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థినుల చేత న్యాయవాదులు ప్రతిజ్ఞ చేయించారు. న్యాయవాదులు నగేష్, సిరాజ్, నాగరాజు, కోర్టు సిబ్బంది రాఘవేంద్ర, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

ఆలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు బాలరాజు, ఉపేంద్ర అన్నారు. అధ్యక్షులు దేవేంద్రప్ప అన్నారు. హులేబీడు గ్రామంలో బుధవారం రూ. పది లక్షలతో ఎన్ఆర్‌జీయస్ నిధులతో సీసీ రోడ్డు పనులను చేపట్టారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈరప్ప, ఆశప్ప పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లులు చెల్లించం : పీఆర్ ఏఈ


జి.ఎర్రగుడిలో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించకుంటే బిల్లులు చెల్లించమని పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం జి.ఎర్రగుడిలో రూ.10లక్షల ఉపాధి నిధులతో చేస్తున్న సీసీ రోడ్ల పనులను మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేకర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వాములు ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఎఫ్ఏ వెంకట్, జయరాం నాయక్, ఖాదర్ ఉన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా


టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబానికి భరోసా వస్తుందని ఆ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పారా విశో, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు అన్నారు. బుధవారం ఎస్సీ కాలనీలో సభ్యత్వ నమోదు చేపట్టారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా వస్తుందన్నారు. సాయినగర్ బాషా, నాగరాజు, తదితరులు ఉన్నారు.

సమావేశంలో నివేదికలు

వెల్దుర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సుహాసినమ్మ అధ్యక్షతన ఎంపీపీ మిద్దె రంగస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు నివేదికలను సమర్పించి, వచ్చే మూడు నెలల్లో చేయన్ను పనుల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శైలజ, ఏవో అక్బర్‌బాషా, ఎంఈవో-2 రమేష్, విద్యుత్ ఏఈ సుదన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య, పిఆర్‌ఏఈ మల్లిఖార్జున పాల్గొన్నారు.

సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా

తుగ్గలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రూ.వంద చెల్లించి, టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఈశ్వర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు బాలబాషా అన్నారు. బుధవారం పగిడిరాయిలో సభ్యత్వ నమోదు చేశారు. నక్కల రమేష్, గుండమయ్య, ప్రభాకర్ రెడ్డి, డీలర్ సుంకన్న, లక్ష్మికాంతరెడ్డి, రాము, నారాయణ గౌడు, నాగార్జున, సుంకయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో రగడ


భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర పాఠశాల మధ్యాహ్న భోజనం నిర్వాహకులపై కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఎంపీడీవో కొండయ్య, ఎంఈవో రంగస్వామి, ఎంఈవో-2 గోపాల్ పరిశీలించడానికి వెళ్లారు. అలాగే హంపా, ఎడవలి గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లతో రాజీనామా చేయించడానికి ఏపీవో నర్సిరెడ్డి వెళ్లారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, నిర్వాహకులు మమ్మల్ని ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించడంతో అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయన్నారు. పాత వారినే కొనసాగిం చాలని మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆంజనే యులు, వైసీపీ ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్ అధికారులతో వాగ్వావాదానికి దిగారు. దీంతో గందరగోళం కనిపించింది. ఎంపీడీవో కొండయ్య, ఎంఈవో రంగస్వామి మాట్లా డుతూ ఏజెన్సీలను మార్చాలని ఒత్తిళ్లు వస్తున్నాయన్నారు.

రహదారిపై నిలిచిన మురుగు

ఇబ్బందుల్లో ప్రజలు

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఎమ్మిగనూరు.. గ్రీన్ ఎమ్మిగనూరు అంటూ మున్సిపల్ అధికారులు రహదారుల వెంట పెద్దపెద్ద అక్షరాలతో ప్రకటనలు రాస్తూ సరిపెట్టుకుంటున్నారే తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న మేకల మార్కెట్ ప్రాంతంలో ఓ వీధిలో మురుగునీరు రహదారిపై నిలిచి మడుగులా మారింది. వాల్మీకి సర్కిల్ నుంచి మేకల మార్కెట్, సంతమార్కెట్‌కు వెళ్లే రహదారి రావడంతో నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు, మార్కెట్ వైపు ఉన్న మురుగు కాల్వ చెత్తాచెదారం, పూడికతో నిండిపోవడంతో రహదారిపై మురుగునీరు నిలిచిపోయింది. అటు ఇటు రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే రహదారిపై మురుగునీరు ఆగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషన్ గంగిరెడ్డి వివరణ కోరగా రోడ్డు తగ్గులో ఉందని, దాన్ని ఎత్తుగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు.


రహదారిలో మడుగులా నిలిచిన మురుగు

రోడ్డెక్కిన మురుగు

గోనెగండ్ల: గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దాంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. రెండు రోజుల క్రితం గ్రామంలో చిన్నారికి డెంగీ సోకింది. గ్రామంలో పలు వీధుల్లో సీసీ రోడ్డు ఉన్న చోట డ్రైనేజీలు లేవు. దాంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రహదారులపై పారు తోంది. దాంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామంలో దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. రెండు రోజుల క్రితం ఓ బాలుడికి డెంగీ సోకింది. సంబంధింత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పెద్దనేలటూరులో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

మెనూ పాటించాలి


ఎర్రబాడులో మధ్యాహ్న భోజనాన్ని రుచి చుస్తున్న తహసీల్దార్

గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో తప్పని సరిగా మెనూ పాటించాలని గోనెగండ్ల తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరంగా ఉన్నదా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని సూచించారు. పిల్లలకు కడుపునిండా అన్నపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభల్లో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తాం: గ్రామసభల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. బుధవారం ఎర్రబాడు గ్రామంలో ఆయన పర్యటించారు. పంట పొలాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

గదుల అనుమతి రద్దు చేయాలి: సీపీఐ

పత్తికొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్యం షాపుల పక్కన సిట్టింగు గదుల అనుమతి రద్దుచేసి బెల్టు షాపులను తొలగించాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహేబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, తిమ్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు.


వైభవంగా ద్వాదశి వేడుకలు

బంగారు రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ద్వాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి


స్వర్ణపంచాయతీ ఆన్‌లైన్ పద్ధతిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్‌లో ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్న గృహాల వారు తప్పని సరిగా స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆమె పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. స్వర్ణపంచాయతీ ఆన్‌లైన్ చేసే విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామాలలో ఉన్న గృహాల వారు 2024-25 సంవత్సరానికి చెందిన ఇంటి గుత్తలు చెల్లించి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్ణపంచాయతీలో ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఈ విధానం ద్వారా ఎప్పుడైనా ఎక్కడి నుంచైనా ఇంటి గుత్తలు చెల్లించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

ముగ్గురికి గాయాలు



గంజహళ్లి రోడ్డులో అదుపు తప్పి గుంతలో పడ్డ ఆటో

గోనెగండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంజహళ్లి రోడ్డులో ఎల్లెల్సీ కాలువ మలుపు దగ్గర బుధవారం సాయంత్ర ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలైయ్యాయి. గోనెగండ్ల నుంచి ఆటోలో 12 మందిని ఎక్కించుకుని గంజహళ్లి గ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో రోడ్డు పక్కనే ఉన్న గుంతలో ఆటో బోల్తా పడింది.ఆటోలో ఉన్న నరసమ్మ, రంగప్ప, వీరాంజినేయులకు తీవ్ర గాయాలు అయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలైయ్యాయి. గాయపడిన వారిని గోనెగండ్ల ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కంటి సమస్యలపై జాగ్రత్తలు అవసరం

కంటి నిపుణుడు డాక్టర్ హేమంత్ కుమార్


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలు పాటిస్తూ కళ్లను కాపాడుకోవాలని ఆర్కే కంటి వైద్యశాల కంటి నిపుణుడు డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. బుధవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలోని సుజీంద్ర ఆరోగ్యశాలలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల విజ్ఞప్తిమేరకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. 50 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమైనట్లు గుర్తించి త్వరలో వారికి శస్త్ర చికిత్స నిర్వహిస్తామని డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మఠం వైద్యులు సుజీంద్ర, కులకర్ణి, శ్రీకాంత్ శాస్త్రి, ఆసుపత్రి కోఆర్డినేటర్ విజయేంద్రరావు, ఫార్మాసిస్టు ప్రదీప్, ఆర్కే వైద్యశాల సిబ్బంది ఆనంద రావు, సత్యనారాయణ, హనుమంతు, శాంతి, రాజేష్, సౌజన్య, శైలజ, అశ్విని, కుమార్, శివ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అపార్‌ను పకడ్బందీగా చేపట్టండి


ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో

కౌతాళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పేరు చిరునామా, పుట్టిన తేదీలను అపార్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీవో సుబ్బరాజు సూచించారు. బుధవారం కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సేవలను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే అధ్యాపకులు విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలంలో కూడా ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట కళాశాల ప్రధానాచార్యులు సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వరరెడ్డి ఉన్నారు.